# అవగాహన

కె.కె. భాగ్యశ్రీ

అలలతో ఎగిసిపడే సంద్రపు ఘోషను మౌనంగా వింటున్నారు విద్యాధరరావుగారు. ఆయన హృదయంలో అంతకుమించిన ఆత్మఘోష.

భారమైన మనస్సులో చెలరేగే భావ సంఘర్షణను అదుపులో పెట్టుకోడానికి శతవిధాల ప్రయత్నిస్తూ, విఫలమౌతూనే ఉన్నారు ఆయన ఆరోజు ఉదయం నుండీ.

రోజూ అలా సాయం సమయంలో ఆయన బీచ్‌కి వస్తూనే ఉంటారు. నీలిరంగు సాగరంపై, పాలపొంగులా తేలియాడే కెరటాల్ని వీక్షిస్తూ, ఎంతో ఆనందాన్ని ఇంకెంతో ప్రశాంతతను పొందుతూ ఉంటారు.

కాని... ఈరోజు అందుకు విరుద్ధంగా జరుగుతోంది.

ఎంతగా వద్దనుకున్నా, అంతులేని అంతరంగ మధనం తప్పనిసరి అయ్యింది.

తన మాటలకు రవంతైనా గౌరవం ఈయని కొడుకును తలుచుకుంటూంటే బాధ ద్విగుణీకృతమౌతోంది.

ఈరోజు ఉదయం–

ఆఫీస్‌కి బయలుదేరుతున్న దీక్షిత్ హాల్లో పేపర్ చదువుకుంటున్న తండ్రి దగ్గరకు వచ్చాడు.

''ఏరా! ఆఫీస్‌కింకా బయలుదేరలేదా?'' అడిగారు విద్యాధరరావుగారు కొడుకుకేసి ప్రేమగా చూస్తూ.

''లేదు నాన్నా! మీతో ఓ ముఖ్యమైన సంగతి చెప్దామనీ...'' అర్థోక్తిలో ఆపేశాడు దీక్షిత్.

''ఏంటిరా.. చెప్పు!'' ఆప్యాయంగా కొడుకుని అడిగారు విద్యాధరరావుగారు.

''మరేంలేదు నాన్నా! మీకోడలు మాధవి ఆమధ్య బ్యాంక్ టెస్ట్‌లు వ్రాసి, రిటెన్ టెస్ట్‌లో కూడా ప్యాసయ్యిందన్న సంగతి మీకు తెలుసు! ఇంటర్వ్యూకి కూడా హాజరైందన్న విషయం కూడా విదితమే... లక్కీగా మాధవికి బ్యాంక్‌లో జాబ్ వచ్చింది. మరో టెన్‌డేస్‌లోపల వచ్చి జాయినవ్వమని అపాయింట్‌మెంట్ ఆర్డర్ కూడా వచ్చింది'' చెప్పాడు దీక్షిత్ ఆనందంగా.

''మరింకేం... జాయినైతే సరి!''

''కాని... చిన్న చిక్కుంది నాన్నా!''

''చిక్కా! ఏంటిరా?''

''మొదటగా హైదరాబాద్‌లో పోస్టింగ్ ఇస్తారుట. అందుకే మాధవి పిల్లలను కూడా తీసుకెళ్ళిపోయి జాబ్‌లో జాయినైపోతుంది. ఎలాగూ వాళ్ల పిన్నివాళ్లు అక్కడే ఉన్నారు కదా! నేను కూడా ట్రాన్స్‌ఫర్‌కి ట్రై చేద్దామనుకుంటున్నాను. దానిసంగతింకో నెలరోజుల్లో తేలవచ్చు. అప్పుడు మనిద్దరం కూడా హైదరాబాద్ వెళ్లిపోవచ్చును. ఈలోగా మాధవి ఇల్లు వెతికి ఉంచుతుంది. ఏమంటారు?'' తండ్రి సమాధానం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తూ అన్నాడు దీక్షిత్.

''నేనా! నేను రాను..'' ఖంగుమంది విద్యాధరరావుగారి కంఠం.

''మీరు.. రారా! ఏం? ఎందుకు?'' తెల్లబోతూ అడిగాడు దీక్షిత్.

''ఈ ఇంటిని వదిలి నేనెక్కడికీ రాను. అయినా ఇప్పుడంత దూరంవెళ్లి మాధవి ఉద్యోగం చేయకపోతే వచ్చిన నష్టం ఏంటి? నువ్వు బాగానే సంపాదిస్తున్నావు. నాకా పెన్షన్ వస్తోంది. స్వంతిల్లే కాబట్టి అద్దె ఇవ్వవలసిన అగత్యంలేదు. ఇంకా ఎందుకురా మాధవికి ఉద్యోగం చేయాలన్న కోరిక. ఇప్పుడు మనకొచ్చిన లోటేంటి చెప్పు?'' అనునయంగా అన్నారు ఆయన.

ఆయన వివరణ దీక్షిత్‌ని తృప్తిపరచలేదన్న సంగతి, అతని ముఖకవళికలే తేటతెల్లం చేస్తున్నాయి.

''ఇప్పుడేలోటూ లేకపోవచ్చు నాన్నా! కానీ భవిష్యత్తు గురించిన ముందు చూపుతోనే నేనిలాంటి నిర్ణయానికొచ్చింది. నేను గుమస్తాగిరీ చేసినట్టే 'నా పిల్లలు కూడా అదే చేయాలని నేనుకోవటంలేదు. వాళ్లిద్దరూ తెలివైనవారు. పైగా మా పిల్లలు ఇప్పుడు అన్ని రంగాల్లోనూ కాంపిటీషన్ బాగా పెరిగిపోయింది. భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేస్తే గాని పిల్లల్ని బాగా చదివించలేరు. వాళ్లని బాగా చదివించి వారి జీవితాలని తీర్చిదిద్దాలన్న తాపత్రయం నాకుంది. అందుకే అదృష్టవశాన వచ్చిన ఈ సదవకాశాన్ని నేను జారవిడుచుకోదలచుకోలేదు..'' కాస్సేపు ఆగాడు దీక్షిత్.

విద్యాధరరావుగారేం మాట్లాడలేదు. తన అభిప్రాయానికి పూచికపుల్ల విలువ కూడా ఇవ్వని కొడుకు వైపు విచారంగా చూశారు ఒక్కక్షణం.

''మేమొక్కరమూ వెళ్లిపోయి, పెద్దవారు మిమ్మల్నిక్కడ వదిలేయడం మాకు ఎంతమాత్రం ఇష్టంలేదు. అందుకే మిమ్మల్ని కూడా మాతో తీసుకెళ్దాం అనుకుంటున్నాము. ఒక తండ్రిగా నా పిల్లల భావి జీవితాలను అందంగా మలచుకోవాలన్న తపన నాకుండడం తప్పంటారా నాన్నా!'' ఆవేదనగా అడిగాడు దీక్షిత్.

''నీ ఆలోచనలు, ప్రణాళికలు నీకెంత ముఖ్యమో, నాకు నా అభిప్రాయాలంతే ముఖ్యం. బంగారంలాంటి ఇంటిని అద్దెలవాళ్లమీద వదిలేసి వస్తే ఇంటిని వాళ్ల ఇష్టమొచ్చినట్లుగా తగలబెడతారు. నీ ఇష్టం ప్రకారం నువ్వు చేసుకో. నాకు తోచిన మంచి నేను చెప్పాను. వినకపోతే అది నీ ఖర్మం.'' నిక్కచ్చిగా వెల్లడి చేశారు విద్యాధరరావుగారు తన భావాల్ని.

''మీకింత పట్టుదల తగదు నాన్నా! ఇక్కడ మిమ్మల్ని ఒంటరిగా వదిలేయడం ఇష్టంలేక బ్రతిమలాడితే మీకర్థం కావడంలేదు. ఈ అవకాశం కాలదన్నుకుంటే, కావాలనుకున్నప్పుడు మళ్లీ దొరకకపోవచ్చు. సో.. మాధవి ఉద్యోగంలో చేరడం మాత్రం ఖాయం.'' కోపంగా అంటూ, బయటికెళ్లిపోయాడు దీక్షిత్ విసురుగా.


అతడి ప్రవర్తనకు, దురుసుతనానికి కించిత్ బాధపడ్డారు విద్యాధరరావుగారు.

''తనేమిటన్నాడని వాడికంత కోపం? హాయిగా నీడపట్టునే ఉండి పిల్లల్ని బాగా చూసుకోక? ఎందుకొచ్చిన ఉద్యోగం... పిల్లల్ని తీసుకొని తననుండి దూరంగా వాళ్లు వెళ్లిపోతుంటే తను భరించగలడా? ఒక్కడూ ఉండగలడా?'' ఆయన అంతరంగంలో బాధ సుళ్లుతిరిగింది.

అంతలోనే చిన్నకోపం కూడా వచ్చింది.

'తన అభిప్రాయంతో వారికి పనిలేనప్పుడు, తనకి మాత్రం వారి ఇష్టాయిష్టాలతో సంబంధం ఏముంది? తనిక్కడే ఉంటాడు. ఏదో, పనిపిల్ల సాయంతో ఇంత ఉడకేసుకు తింటాడు కాని వారితో మాత్రం వెళ్లడంతే!' నిశ్చితమైన నిర్ణయానికి వచ్చారాయన.

• • •



''పల్లీ బాబూ! పల్లీ.. వేడి వేడి పల్లీ..'' పల్లీలమ్మే తాత కేకతో ఆలోచనా సంద్రంలో తలమునకలవుతున్న విద్యాధరరావుగారు ఈలోకంలోకి వచ్చారు. రోజూ రెండు పొట్లాల పల్లీలు కట్టించి ఇంటికి తీసుకెళ్లడం ఆయనకి అలవాటు. మనవలిద్దరూ ఆయన ఇల్లు చేరగానే ''తాతయ్యా! ఏం తెచ్చారు?'' అంటూ ఎదురొస్తారు.

''తాతా! రెండు పొట్లాలియ్యి.'' జేబులోంచి డబ్బులు తీస్తూ అడిగారు.

''అట్టాగేబాబూ! ఏటీ ఆలోసిత్తున్నారు?'' ఆయన కవళికల్ని చదివినట్లుగా అడిగాడు తాత.

''ఏం లేదు.. ఏం లేదు!'' అంటూ తడబడ్డారాయన. ''తాతా! ఇంద పొట్లాలు'' అన్నమాటకు తాత వైపు తిరిగి చూశారు విద్యాధరరావుగారు.

అప్పుడు గమనించారాయన తాత ప్రక్కనే ఉన్న పద్నాలుగేళ్ల కుర్రవాడిని. వాడే చకచక పొట్లాలు కట్టి అందించాడు.

''ఇందండి బాబూ!'' వాటిని విద్యాధరరావుగారి చేతిలో ఉంచాడు తాత.

''ఇంతసేపూ చూడనేలేదు! ఎవరీ కుర్రాడు తాతా?'' ఆసక్తిగా అడిగారాయన.

''నా మనవడు బాబూ! అమ్మా, అయ్యా లేనోడు. నేనే పెంచుతున్నాను బాబూ!''

''ఎప్పుడూ నీతో కనబడడేం?'' అడిగారు విద్యాధరరావుగారు సందేహంగా.

''ఇస్కూలు బడిలో ఈడు తొమ్మిది సదూతున్నాడు బాబూ! అందుకే ఎప్పుడూ నాతో రాలేదు'' చెప్పాడు తాత మనవడివైపు ఆప్యాయంగా చూస్తూ.

''ఈ వయసులో నువ్విలా కష్టపడి, వాడిని చదివించకపోతే, నీతోపాటు వ్యాపారంలో పెట్టచ్చుకదా!'' సలహా ఇచ్చారు ఆయన.

''నాను పల్లీలమ్ముకుని బతుకుతున్నానని.. ఆడినీ అట్టానే బతకమనటం దరమమా బాబూ? అందుకే.. ఎట్టాగోట్టాగ ఆడిని పద్దాకా అయినా సదివించితే, బంటురోతుద్యోగం అయినా వస్తుందిగా బాబూ!''

తాత సమాధానం సూటిగా తాకింది విద్యాధరరావుగారి హృదయాన్ని. అయినా అడిగారు బింకంగా ''కుల వృత్తికి సాటిరాదు గువ్వల చెన్నా అన్నారు పెద్దలు. నీ పనే వాడు కూడా చేస్తే తప్పేంటి?''

తాత నవ్వాడీసారి. ''నిజమే బాబూ! కానీ.. పగలల్లా కష్టపడితే నాకేటొత్తున్నది బాబూ! ఏదో! మీలాంటి దరమ పెబువుల దయతో ఆడిని సదివించే దయిర్యం సేసాను. కడుపు నింపని కులపురితి ఎందుకు బాబూ. ఆడు సదూకొని ఆడి బతుకాడు బతికితే అంతేసాలు బాబూ'' అన్నాడు తాత.

వాడి బాణాల్లాంటి తాత మాటలు పదునుగా గుచ్చుకున్నాయి ఆయన గుండెల్లో.

''వత్తాను బాబూ! ఇంకా ఇయ్యన్నీ అమ్మేత్తేగాని ఈ పూటకి కూడు దొరకదు. పల్లీ బాబూ.. పల్లీ!'' అరుచుకుంటూ మనవడి భుజంమీద చేయివేసుకొని నడిపించుకుంటూ పోయాడు తాత.

తాత అన్నమాటలకి ఒక్కసారిగా ఆలోచనలో పడ్డారు విద్యాధరరావుగారు.

''నాను పల్లీలమ్ముకుని బతుకుతున్నానని.. ఆడినీ అట్టానే బతకమనడం దరమమా బాబూ!''

''నేను గుమాస్తాగిరీ చేసినట్లే, నా పిల్లలు కూడా అదే చేయాలని అనుకోవడంలేదు..''

తాత మాటలను, కొడుకు మాటలను బేరీజు వేసుకొని చూసుకుంటున్నారాయన. ఏదో కొత్త సత్యం కనుగొన్నట్లయ్యింది. తాత ఎంత చక్కగా చెప్పాడు. ఏం చదువుకున్నాడని తాతకంత ఆలోచనాశక్తి అబ్బింది? అవును! తాత లోకాన్ని చదివాడు.

కొడుకన్న మాటల్లో కూడా ఎంతో అర్థం ఉందనిపించింది ఆయనకి ఆక్షణం. అన్నవస్త్రాదులకు లోటు లేకపోవచ్చుగాని.. పెరుగుతున్న ఆర్థిక అవసరాల దృష్ట్యా మాధవి కూడా ఉద్యోగం చేయడం అవసరమేనని పిస్తోంది ఇప్పుడాయనకి.

'అయినా, కొడుకేం తనని వదిలేస్తానని అనలేదే! తనతోపాటు రమ్మనేగా వాడికోరిక. తనే అనవసరంగా అపార్థం చేసుకున్నాడు. ఏ విషయాన్నయినా చూసే కోణాన్ని బట్టి ఉంటుంది అందులోని అర్థం.

ఎక్కడ ఉంటే ఏమిటి? అందరూ కలసి మెలసి ఉన్నప్పుడు?'

పాజిటివ్‌గా ఆలోచించడం మొదలెట్టాక ఆయన హృదయం తేలికబడింది.

'మనుమల్ని వదిలి తను ఉండలేడు. అందుకే.. తాను కూడా వారితో వెళ్లిపోతాడు' స్థిరంగా అనుకున్నారాయన.

• • •

ఇంటికొచ్చాక- ''అమ్మా! మాధవీ.. ముందర నువ్వెళ్లిపోయి ఉద్యోగంలో జాయినయిపోమ్మా! పిల్లల్ని నీతోకూడా తీసుకెళ్తే ఇబ్బంది పడతావు. నేను, అబ్బాయి, పిల్లలు కలిసి తరువాత వస్తాం. మంచి ఇల్లు వెదికి ఉంచు ఈలోపల. అప్పటికి నేనూ, అబ్బాయి కలిసి సామాన్లన్నీ ప్యాక్ చేస్తాం'' ప్రశాంత దృక్కులతో చూస్తూ, ఆప్యాయంగా అంటూన్న మామగారిని ఆశ్చర్యంగా వీక్షిస్తూండిపోయింది మాధవి.

★